సూర్య
18వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
25-01-2025
పేజీలు: 02

# గాయపడ్డ అభిషేక్ శర్మ





భారత క్రికెటర్ అభిషేక్ శర్మ గాయపడ్డాడు. దీంతో అతను చెన్నైలో ఇంగ్లండ్‌తో జరిగే రెండో టీ20 మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా ఉన్నది. నెట్స్‌లో శుక్రవారం క్యాచింగ్ ప్రాక్టీసు చేస్తున్న సమయంలో అతను గాయపడ్డాడు. అభిషేక్ శర్మ మడిమ ట్విస్ట్ అయ్యింది. దీంతో అతను తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. ఫీల్డ్ వద్ద ఉన్న టీం ఫిజియో అతన్ని చెక్ చేశాడు. ఆ తర్వాత అభిషేక్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. నడుస్తున్న సమయంలో అతను ఇబ్బందిపడినట్లు కనిపించింది. నెట్స్‌లో ఆ తర్వాత అతను బ్యాటింగ్ కూడా చేయలేదు. డ్రెస్సింగ్ రూమ్‌లోనే సుమారు అరగంట పాటు ఫిజియోతో గడిపాడు అభిషేక్. కోల్‌కతాలో జరిగిన ఫస్ట్ టీ20లో అభిషేక్ శరవేగంగా 79 రన్స్ చేసిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో ఇండియా ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఒకవేళ శనివారం జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడలేని పక్షంలో .. అతని స్థానంలో వాషింగ్టన్ సుందర్ లేదా ధ్రువ్ జురెల్‌ను జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

## వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీగా భారత సంతతి జర్నలిస్టును నియమించిన ట్రంప్

భారత సంతతి జర్నలిస్టు కుశ్ దేశాయ్‌ని వైట్‌హౌజ్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియమించారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో కుశ్ దేశాయ్.. 2024 రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్, ఐయోవా రిపబ్లికన్ పార్టీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా చేశారు. పెన్సిల్వేనియాకు కూడా డిప్యూటీ డైరెక్టర్‌గా చేశారు. అమెరికాలోని కీలకమైన రాష్ట్రాల్లో ప్రెస్ కార్యదర్శిగా కుశ్ దేశాయ్ వ్యవహరించినట్లు వైట్‌హౌజ్ తన ప్రకటనలో పేర్కొన్నది. బ్యాటిల్ గ్రౌండ్ లేదా స్వింగ్ స్టేట్స్ అన్నింటిలో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఏడు కీలకమైన రాష్ట్రాలను ట్రంప్ కైవసం చేసుకున్నారు. డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా కుశ్ దేశాయ్‌ను నియమిస్తున్నట్లు శుక్రవారం వైట్‌హౌజ్ ప్రకటించింది.








## ఘోర ప్రమాదం.. ఫుట్ పాత్ పైకి దూసుకెళ్లిన కారు

బంజారాహిల్స్ లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. ఇవాళ(శనివారం) తెల్లవారుజామున బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద కారు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆస్పత్రి వద్ద ఫుట్ పాత్‌పై ముగ్గురు నిద్రిస్తుండగా వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి వారిపైకి దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనంతరం బాధితులను చూసిన కారులోని వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు హుటాహుటిన చేరుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధితులను ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునే దిశగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కారు ఎవరిది, ప్రమాదం ఎలా జరిగింది, పరారైన నిందితులు ఎవరనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



# ముంబై ఉగ్రదాడుల నిందితుడి అప్పగింతకు అమెరికా సుప్రీం ఓకే

ఈ సంఖ్య చూడగానే ముందుగా గుర్తొచ్చేది దేశ ఆర్థిక రాజధాని ముంబై ఉగ్రదాడి ఘటనే . 16 ఏళ్ల క్రితం మహా నగరంలో జరిగిన మారణహోమాన్ని తలుచుకుంటే దేశ ప్రజలకు ఇప్పటికీ వణుకు పడుతుంది. నాటి ఘటనలో దోషిగా తేలిన తహవూర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు అప్పగించేందుకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. అతడిని భారత్‌కు అప్పగించేందుకు అమెరికా సుప్రీంకోర్టు (US Supreme Court) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కేసులో తహవూర్ రాణా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. 64 ఏళ్ల తహవూర్ రాణా (Tahawwur Rana) పాకిస్థాన్ మూలాలతో ఉన్న కెనడా పౌరుడు. 26/11 ముంబయి ఉగ్రదాడుల్లో కీలక సూత్రధారిగా అతడిని గుర్తించారు. ప్రస్తుతం రాణా లాస్ ఏంజెల్స్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. అతడిని భారత్‌కు అప్పగించాలని భారత్ గత కొంతకాలంగా అమెరికాను కోరుతోంది. భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి అమెరికా గతంలోనే సానుకూలంగా స్పందించింది. ఇక అతడి అప్పగింత విషయమైన భారత్ న్యాయస్థానాల్లో పోరాడుతోంది. ఈ క్రమంలో భారత్ ప్రయత్నాలను తహవూర్ పలు ఫెడరల్ కోర్టుల్లో సవాల్ చేశాడు. తనను భారత్‌కు అప్పగించొద్దంటూ పిటిషన్‌లు వేశాడు. అయితే, రాణా చేసిన పిటిషన్లు అమెరికా ఫెడరల్ కోర్టులు తిరస్కరిస్తూ వచ్చాయి. దీంతో అతడు చివరి ప్రయత్నంగా గతేడాది అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశాడు. అతడి పిటిషన్‌పై అమెరికా సుప్రీంకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా అతడి పిటిషన్‌ను కొట్టివేయాలని అమెరికా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. రాణా అభ్యర్థనను తిరస్కరించింది. సుప్రీం తీర్పుతో న్యాయపరమైన ప్రక్రియ పూర్తైన తర్వాత అతడిని భారత్‌కు అప్పగించే అవకాశాలు ఉన్నాయి.






## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

తెలంగాణలో సంచలనం సృష్టించిన టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు తిరిగింది. నవంబర్ 2023 సంవత్సరంలో 15 రోజుల పాటు త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డి టెలిఫోన్ ట్యాప్ చేసినట్లుగా అధికారులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా ఇంద్రసేన రెడ్డి పీఏను అధికారులు విచారించిన సమయంలో ఈ విషయం బయటపడింది. ప్రస్తుతం ఇంద్రసేనరెడ్డి త్రిపుర గవర్నర్‌గా ఉన్నారు. కాగా.. ఫోన్‌ట్యాపింగ్‌లో ఇప్పటి వరకు కాంగ్రెస్‌కు సంబంధించి నేతల ఫోన్లే ట్యాపింగ్ గురైనట్లు అంతా భావించారు. కానీ ఈ ఫోన్ ట్యాపింగ్‌లో బీజేపీకి సంబంధించి నాయకుల పేర్లు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం త్రిపుర గవర్నర్‌గా ఉన్న ఇంద్రసేనరెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అధికారులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా ఇంద్రసేనా రెడ్డి పీఏను కూడా విచారించారు అధికారులు. ఇంద్రసేనరెడ్డి సంబంధించిన అన్ని వ్యవహారాలను పీఏ చూసుకున్న నేపథ్యంలో.. ఆయనను ఇందులో సాక్షిగా పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.మరోవైపు ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో ఇంద్రసేన రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గవర్నర్‌గా ఉన్న సమయంలో ఇంద్రసేన రెడ్డి ఫోన్ ట్యాప్ చేయడం వెనక ఉన్న అసలు ఉద్దేశం ఏంటి అనేదానిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపనున్నారు. ఇప్పటి వరకు దాదాపు 300 మంది నాయకులు, బిజినెస్‌మ్యాన్‌లు, రియల్ఎస్టేట్ వ్యాపారుల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు ఒక ప్రాథమిక అంచనాకు వచ్చిప్పటికీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ వలలో చిక్కిన మరో యువకుడు

బెట్టింగ్ కాదది..బ్లాక్‌హోల్..! లోపలికి వెళ్లడమే తప్ప..బయటకు రావడమన్నదే ఉండదక్కడ. వందలు, వేలతో మొదలైన మాయాజూదం..చూస్తుండగానే లక్షలకు చేరుతోంది. ఆపై అప్పుల ఊబిలో చిక్కుకుని.. జేబులు గుల్లవుతాయి. అత్యాశతో కొందరు.. వ్యసనాల బారిన పడి మరికొందరు..ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి నిండు జీవితాలను బలిచేసుకుంటున్నారు. తమతో పాటు తమ కుటుంబాలను సైతం బలిపీఠం ఎక్కిస్తున్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన నిరంజన్ వలి అనే యువకుడు బజాజ్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మంచి జీతం బాగానే ఉందనుకున్న సమయంలో బెట్టింగ్ యాప్‌లకు బానిస అయ్యాడు. అందులో పూర్తిగా కూరుకుపోయి సూసైడ్ లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బెట్టింగ్ యాప్ ద్వారా 13 లక్షల రూపాయలు పోగొట్టుకోవడంతో తాను సూసైడ్ చేసుకుంటున్నానంటూ 6 పేజీల లెటర్ రాసి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఇంటి నుండి పోయాడు. దీంతో కంగారుపడ్డ



తల్లిదండ్రులు బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆ యువకుడు రాసిన లెటర్ ప్రకారం బెట్టింగ్ యాప్ లకు బానిసను అయ్యానని బెట్టింగ్ వల్ల తీవ్ర అప్పులు చేయడం వల్ల గతంలో పలుమార్లు తన తండ్రి అప్పులు తీర్చాడని పేర్కొన్నాడు. మళ్లీ అప్పులు చేశానని తన తండ్రికి మొహం చూపించలేకనే వెళ్లిపోతున్నట్లు తెలిపాడు. అంతేకాకుండా బంధువులు, కస్టమర్ల దగ్గర ఉన్న బజాజ్ కార్డులలో వారికి తెలియకుండా డబ్బులు తీసుకుని నెల నెల చెల్లిస్తున్నానని వెల్లడించాడు. అయితే ఒక్క నెల చెల్లించకుండా కస్టమర్లకు ఫోన్ వెళుతుందని, అప్పుడు కస్టమర్కు తెలియకుండా డబ్బులు వాడుకున్న సంగతి వారికి తెలుస్తుందని మదనపడ్డాడు. ఇక జైలు శిక్ష పడుతుందని, ఈ బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని రాశాడు. అలాగే ప్రతి నెల ఎల్ఐసీ చెల్లిస్తున్నానని, చనిపోయిన తర్వాత వచ్చే ఎల్ఐసీ డబ్బులు అందరూ అప్పులు తీర్చాలని లెటర్‌లో రాసి ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఏడు నెలల క్రితం నిరంజన్ వలికి వివాహం అయింది. ప్రస్తుతం భార్య గర్భవతిగా ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిరంజన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



## దాని కోసం నేను పెద్ద త్యాగమే చేశాను

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయింది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ వరుస సినిమాలతో బిజీగా అయ్యింది. తక్కువ సమయంలోనే ఈ చిన్నది స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఆతర్వాత పాన్ ఇండియా సినిమాలు చేస్తూ ఫుల్ ఫేమస్ అయ్యింది. నటి రష్మిక మందన అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' చిత్రంతో పాన్ ఇండియా హిట్ అందుకుంది.రీసెంట్ గా విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది ఈ సినిమా. ఇక ఇప్పుడు రష్మిక రష్మిక మంధాన లక్ష్మణ్ ఉదేకర్ దర్శకత్వంలో చావా అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఛత్రపతి శివాజీ-సాయిబాయి దంపతుల పెద్ద కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజు జీవితం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. ఛత్రపతి శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్ నటిస్తుండగా, శంభాజీ భార్య పాత్రలో నటి రష్మిక మందన్న నటిస్తుంది. ఈ నేపథ్యంలో నటి రష్మిక క్యారెక్టర్ పోస్టర్ ఇంటర్నెట్‌లో విడుదలై వైరల్ అవుతోంది. రష్మిక 5 ఏప్రిల్ 1996న కర్ణాటకలో జన్మించింది. 2016లో రష్మిక 'కిరాక్ పార్టీ' చిత్రంతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.

## నీట్ యూజీ రిజిస్ట్రేషన్‌కు అపార్ ఐడీ తప్పనిసరికాదు

నీట్ యూజీ రిజిస్ట్రేషన్‌కు అపార్ ఐడీ తప్పనిసరికాదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ స్పష్టం చేసింది. విద్యార్థులు తమ వద్ద ఉన్న ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో నీట్ యూజీ మార్గదర్శకాలను విడుదల చేసిన ఎన్‌టీఏ.. దరఖాస్తులో అపార్ ఐడీ, ఆధార్ కార్డ్ అవసరం అని పేర్కొంది. నీట్ పరీక్ష ప్రక్రియలో ధ్రువీకరణ, రిజిస్ట్రేషన్ పద్ధతులను సులభతరం చేయడానికి, విశ్వసనీయతను పెంచడానికి ఆధార్, అపార్ ఐడీని ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించే ముందు వారి AAPAR IDని తయారు చేసి, ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ఏజెన్సీ తెలిపింది. దీనిపై విద్యార్థుల్లో గందరగోళం నెలకొనడంతో పరీక్ష నిర్వహణ సంస్థ తాజాగా స్పష్టత నిచ్చింది.

అపార్ ఐడీ అంటే..

అపార్.. ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ. ఇది విద్యార్థుల గుర్తింపు కోసం రూపొందించిన ప్రత్యేక వ్యవస్థ. 'వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ' కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దీనిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఇందులో విద్యార్థుల పూర్తి రికార్డులు నమోదు చేస్తారు. సాధారణంగా అపార్ ఐడీని స్కూల్ నుంచి క్రియేట్ చేస్తారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## విజయసాయి రెడ్డి రాజీనామా ఆశ్చర్యానికి గురి చేసింది : వైసీపీ ఎంపీ గురుమూర్తి

వైసీపీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి రాజీనామా తనను ఆశ్చర్యానికి గురిచేసిందని వైసీపీ తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. రాజీనామా ప్రకటన అనంతరం శనివారం ఢిల్లీలో విజయసాయి రెడ్డిని కలిసేందుకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. వైఎస్‌కు నమ్మినబంటు విజయసాయి రెడ్డి రాజీనామా నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారో వ్యక్తిగతంగా తెలుసుకోవడానికే వచ్చానని వెల్లడించారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాజీనామా ఉపసంహరణను వెనక్కి తీసుకోబోనని, పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని, తనకు సహకరించినందుకు ఎంపీ గురుమూర్తికి విజయసాయి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. వీరిద్దరి భేటీ అనంతరం విజయసాయి రెడ్డి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్ వద్దకు వెళ్లి స్పీకర్ ఫార్మట్‌లో రాజీనామా పత్రాన్ని అందజేశారు.

## తమిళనాడు మహిళా కబడ్డీ ప్లేయర్లపై దాడి

పంజాబ్‌లోని బటిండాలో జరుగుతున్న ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో .. మహిళా కబడ్డీ ప్లేయర్లు ఘర్షణ పడ్డారు. తమిళనాడుకు చెందిన ప్లేయర్లపై అటాక్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మ్యాచ్ రిఫరీ ఇచ్చిన నిర్ణయం పట్ల అసంతృప్తితో ఉన్న ఆటగాళ్లు గొడవపడినట్లు తెలుస్తోంది. బటిండాలో నార్త్ జోన్ ఇంటర్ యూనివర్సిటీతో పాటు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ మహిళల చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. దాంట్లో మదర్ థెరిసా యూనివర్సిటీ, పెరియార్ యూనివర్సిటీ, అలగప్ప యూనివర్సిటీ, భారతీయార్ వర్సిటీలు పాల్గొంటున్నాయి. ప్రత్యర్థి ఆటగాళ్ల మధ్య గొడవ ప్రారంభమైనట్లు తొలుత నివేదిక వచ్చింది. మదర్ థెరిసా యూనివర్సిటీ, దర్భంగా యూనివర్సిటీ మధ్య మ్యాచ్‌లో ఘర్షణ జరిగింది. కబడ్డీ మ్యాచ్ రిఫరీ ఒకరు.. మదర్ థెరిసా జట్టు ప్లేయర్‌పై అటాక్ చేశారు. ఫౌల్ అటాక్‌కు సంబంధించి వాగ్వాదం జరిగిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అవుతున్నది. కొందరు పురుషులతో మహిళలు గొడవకు దిగుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. అయితే వాళ్లు అధికారులు లేక ప్రేక్షకులా అన్న విషయంపై క్లారిటీ లేదు. ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరిపై ఒకరు చైర్స్ విసురుకున్నారు. తమిళనాడు మహిళా కబడ్డీ ప్లేయర్లు క్షేమంగా ఉన్నారని, వాళ్లు త్వరలో రాష్ట్రానికి రానున్నట్లు మంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. ఎవరికీ ఏమీకాలేదని, వాళ్లు ఢిల్లీలోని తమిళనాడు హౌజ్‌కు చేరుకున్నారని, త్వరలో తమిళనాడు రానున్నట్లు చెప్పారు.

## భాగ్యశ్రీ బొర్సె హాట్ లుక్స్

మిస్టర్ బచ్చన సినిమాలో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది భాగ్యశ్రీ బోర్సే. ఈ భామ తాజాగా హాట్ ఫోటోషూట్ చేసి ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ ఇచ్చింది. టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ భాగ్యశ్రీ బోర్సే సినిమాలతో పాటూ సోషల్ మీడియాలోనూ తన గ్లామర్ షోతో కుర్రకారును ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ జీన్స్ అండ్ టీషర్ట్ లో హాట్ ఫోజులిస్తూ ఫొటోలు దిగి వాటిని తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ఈ ఫొటోల్లో భాగ్యశ్రీ హాట్ ఫోజులు చూసిన నెటిజన్స్ 'చలిలో కూడా మంటలు పుట్టిస్తోందిగా..' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్'.. సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో భాగ్యశ్రీ అందానికి తెలుగు సినీ ప్రియులు ఫిదా అయిపోయారు.





## సైకిల్‌పై 18 కి.మీ. తల్లి మృత దేహాన్ని
# మోసుకెళ్లిన కొడుకు

తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి జిల్లాలో ఒక హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. తిరునెల్వేలి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ 65 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందగా, ఆమె కొడుకు తన తల్లి మృతదేహాన్ని 18 కిలోమీటర్లు సైకిల్ మోసుకెళ్లిన ఘటన ప్రజల మనసులను ఎంతగానో కలచివేసింది. తల్లి శవాన్ని సైకిల్‌పై మోసుకెళ్తున్న ఆ దృశ్యాన్ని కొందరు స్థానికులు తమ సెల్‌ఫోన్‌ల ద్వారా ఫోటోలు, వీడియో తీశారు. సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేయటంతో అది వైరల్‌గా మారింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. 64 ఏళ్ల శివకామియమ్మాళ్ తిరునెల్వేలి జిల్లా పక్కనే ఉన్న నంగునేరిలోని నార్త్ మీనవన్ పూల్‌కు చెందినవారు. ఆమెకు ముగ్గురు కుమారులు. భర్త జెబామలై చాలా సంవత్సరాల క్రితమే మరణించాడు. దాంతో శివగామి తన ముగ్గురు కుమారులతో జీవితాన్ని గడిపింది. కానీ, ఇటీవల మొదటి కుమారుడు కుటుంబంతో కలిసి వేరేచోట నివాసం ఉంటున్నాడు. రెండో కుమారుడు కూడా కొన్నాళ్లక్రితం మరణించాడని తెలిసింది. గత కొన్నాళ్లుగా శివకామియమ్మాళ్ మానసిక అనారోగ్యంతో బాధపడుతోందట. అంతేకాదు_ _ _ ఆమె చిన్న కుమారుడు బాలన్ కూడా స్వల్ప మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని తెలిసింది. కానీ, రోజూ తల్లికి కావాల్సిన ఆహారం, మందులు సమయానికి అందిస్తూ.. ఆమెను జాగ్రత్తగా చూసుకునేవాడు. తరచూ తల్లిని తన సైకిల్‌పై ఎక్కించుకుని ఊరంతా తిప్పేవాడట. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం శివకామియమ్మాళ్ ఆరోగ్య పరిస్థితి బాగా విషమించింది. దాంతో ఆమెను తిరునల్వేలి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేస్తున్నారు. చికిత్స పొందుతూ ఆమె మరణించింది. కానీ, అదేది అర్థం చేసుకోలేని 40 ఏళ్ల బాలన్ మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లి శివగామి మృతదేహాన్ని సైకిల్‌పై తీసుకెళ్లాడు. గత నాలుగేళ్లుగా ఏయే ప్రదేశాలకు తల్లిని తీసుకెళ్లేవాడో.. అలాగే, ఆమె మరణం తరువాత కూడా అతడు తల్లి శవాన్ని సైకిల్ పై జాగ్రత్తగా తీసుకెళ్లిన ఈ దృశ్యం ప్రజల హృదయాలను కలిచివేసింది. సైకిల్ తల్లి శవంతో అతడు సుమారు18 కిలో మీటర్ల దూరం ప్రయాణించాడు.

## కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కు షాక్.. మేయర్ సహా 10 మంది కార్పోరేటర్లు రాజీనామా

కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కి బిగ్‌షాక్ తగిలింది. బీఆర్ఎస్‌కి కరీంనగర్ మేయర్ సునీల్‌రావు రాజీనామా చేశారు. శనివారం బీజేపీలో చేరనున్నారు మేయర్ సునీల్‌రావు. మేయర్‌తోపాటు మరో 10మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు సైతం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. బండి సంజయ్ సమక్షంలో వీళ్లంతా బీజేపీ గూటికి చేరబోతున్నారు. బీఆర్ఎస్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు కరీంనగర్ మేయర్ సునీల్‌రావు. BRSలో అవినీతిని భరించలేకే పార్టీ వీడుతున్నట్టు చెప్పారు. రివర్ ఫ్రంట్, స్మార్ట్ సిటీ.. ఇతర పనుల్లో అవినీతి జరిగిందని..ఆ అవినీతి నేత పేరును త్వరలోనే వెల్లడిస్తానన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతి చిట్టా తన చేతిలో ఉందంటోన్న సునీల్‌రావు.. అవసరం వచ్చినప్పుడు గుట్టు విప్పుతానని టీవీ9తో చెప్పారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. బీఆర్ఎస్‌కు 24 మంది కార్పొరేటర్లు ఉండగా అందులో పది మంది పార్టీ వీడారు. దీంతో బీఆర్ఎస్ బలం 14కు పడిపోనుంది. బీజేపీకి ఇప్పటివరకు 16 మంది కార్పొరేటర్లు ఉండగా బీఆర్ఎస్ నుంచి 10 మంది చేరుతుండటంతో కమలం పార్టీ బలం 26కు చేరుతుంది. కాంగ్రెస్‌కు 12 మంది కార్పొరేటర్లు, ఎంఐఎంకు 8 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఈనెల 26తో కరీంనగర్ కార్పొరేషన్ పాలకమండలి గడువు ముగియనుంది. ఈ సమయంలో మేయర్, కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడటం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నేత గంగుల కమలాకర్‌కు తనకు గ్యాప్ లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వలసలు మొదలవడం కరీంనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కమలం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టినట్టు తెలుస్తోంది.



## సింహాన్ని లాక్ చేసిన రాజమౌళి.. SSMB29 ప్రాజెక్ట్ షూరు.!

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. SSMB29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఈ నేపథ్యంలో మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు దర్శకుడు రాజమౌళి. ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ అయినట్లు చెబుతూ.. ఒక వీడియోను విడుదల చేశాడు రాజమౌళి. ఈ వీడియోలో సింహాన్ని (మహేశ్ బాబుని) ఎటు వెళ్లకుండా బోన్‌లో లాక్ చేసినట్లు పాస్‌పోర్ట్ చూపిస్తున్న వీడియో విడుదల చేశారు. దీనికి 'క్యాప్చర్' అనే క్యాప్షన్ పెట్టారు. అయితే ఈ వీడియోతో తాజాగా ఈ మూవీ పట్టాలెక్కబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో ప్రియాంక చోప్రా కథానాయికగా ఫిక్స్ అయినట్లు తన పోస్ట్‌తో ఖరారు చేసింది. మరోవైపు ఈ వీడియోపై మహేశ్ బాబు , ప్రియాంక చోప్రా స్పందించారు. మహేశ్ బాబు స్పందిస్తూ.. ఒక్కసారి కమిట్ అయితే నా మాట నేనే వినను పోకిరిలోని డైలాగ్‌ను కామెంట్



చేశారు. ప్రియాంకచోప్రా స్పందిస్తూ.. ఫైనల్లీ అంటూ రాసుకొచ్చింది. అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథతో వస్తుంది.













## కుంభమేళాలో ధోనీ, కోహ్లీ, రోహిత్ శర్మ.. కాషాయ దుస్తుల్లో స్టార్ క్రికెటర్లు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా విజయవంతంగా కొనసాగుతోంది. 45 రోజులపాటు జరిగే ఈ కుంభమేళాలో భాగంగా గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. తాజాగా ఈ కుంభమేళాలో భారత క్రికెట్ జట్టు స్టార్ ఆటగాళ్లు పాల్గొన్న ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ధోనీ, కోహ్లీ, రోహిత్ శర్మ, బుమ్రా, హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, పంత్ సహా పలువురు క్రికెటర్లు కాషాయ దుస్తుల్లో కుంభమేళాలో దర్శనమిచ్చారు. అయితే, వాళ్లు నిజంగా కుంభమేళాను దర్శించలేదు. ఇదంతా ఏఐ మాయ. ఈ ఫొటోలను టీమ్ ఇండియా మద్దతుదారుల బృందం 'ది భారత్ ఆర్మీ' సోషల్ మీడియాలో పోస్టు చేసింది. 'క్రికెటర్లు మహా కుంభమేళాకు వెళితే' అంటూ ఫొటోలకు క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.